క్లుప్తంగా

ఎమ్మెల్యే సుచరిత రంజాన్ శుభాకాంక్షలు



గుంటూరు రూరల్: నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నిష్టతో ఉపవాస దీక్షను చేసిన ప్రతి ఒక్కరికీ అల్లా కృప కలగాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా రంజాన్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



చేబ్రోలు: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ మహిళ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అందజేశారు. గుంటూరులోని తన కార్యాలయం వద్ద చేబ్రోలుకు చెందిన పసుపులేటి వెంకట స్వప్న కుటుంబ సభ్యులకు రూ.4.20లక్షల చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అంకం సూరిబాబు, చేబ్రోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు సరుకుల పంపిణీ



నడింపాలెం (ప్రత్తిపాడు): మండలంలోని నడింపాలెంలో శుక్రవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన షేక్ ఖాజా మంజూరు జ్ఞాపకార్థం భార్య షేక్ అమినాబి పేద ముస్లింలకు సరుకుల్ని పంపిణీ చేశారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద పోతురాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా సేమియా పాల్గొన్నారు. సగ్గు బియ్యం, పంచదార, కిస్మస్, జీడిపప్పు, నెయ్యి, సన్‌ఫ్లవర్ ఆయిల్, మసాలా దినుసులు, బాస్మతి బియ్యంతో కూడిన బ్యాగుల్ని అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రోజా ప్రకాష్, పదో వార్డు మెంబర్ షేక్ దాదావలి, రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ మందా ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

సుద్దపల్లి(చేబ్రోలు): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై చేబ్రోలు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన దేరంగుల లక్ష్మితో అదే ప్రాంతానికి చెందిన శేషగిరిరావు స్నానం చేసేటప్పుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులకు తెలిపింది. దీనిపై ప్రశ్నించడంతో శేషగిరిరావు, అతని తల్లి.. తన భర్త, పిల్లలపై దాడి చేసి గాయపరిచినట్లు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె. ఆనంద్ తెలిపారు.

గొట్టిపాడు మాజీ సర్పంచ్ బాబూరావు కన్నుమూత

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): గొట్టిపాడు మాజీ సర్పంచ్ గుంటుపల్లి బాబూరావు (66) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఆయన తుదిశ్వాస విడిచారు. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన బాబూరావు, వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉంటూ బలోపేతానికి కృషి చేశారు. ఆయన అకాల మరణంపై శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత, మాజీ ఐఆర్‌ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్, పార్టీ నేతలు తీవ్ర సంతాపం తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పండ్లు పంపిణీ



గుంటూరు మెడికల్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగంలో బాలింతలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. తల్లిపాల ప్రాధాన్యత గురించి, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బాలింతలకు కలిగే ప్రయోజనాల గురించి క్లబ్ సభ్యులు వివరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు విమలకుమారి, కార్యదర్శి పద్మజ, డైరెక్టర్లు ఆదిశేషు, అప్పారావు, డాక్టర్ శ్రావణ్, అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, ఫార్మాసిస్టుల సంఘం నాయకురాలు రాధారాణి పాల్గొన్నారు.

నగరంలో సింగిల్ దందా

- కార్మికులు, కూలీలే టార్గెట్
- ప్రాంతాలను ఎంచుకుని నిర్వహణ
- మామూళ్ల మత్తులో పోలీసులు
- అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్న మఫ్టీ పోలీసులు
- తూతూమంత్రంగా అరెస్టులు
- అసలు వ్యక్తులను వదిలేస్తున్న వైనం





ఆన్‌లైన్‌లో సింగిల్ నంబర్ లాటరీ యాప్ చిత్రాలు

పట్నంబజారు: నగరంలో సింగిల్ నంబర్ ఆటలు జోరుగా సాగుతున్నాయి. అరికడతామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న మాటలు నీటిపై రాతలుగానే మిగిలిపోతున్నాయి. నగరంలోని ఆయా స్టేషన్ల పరిధిలో కొంతమంది అధికారులు, మఫ్టీ పార్టీ కనుసన్నల్లో యథేచ్ఛగా నడుస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా లాటరీ నిర్వాహకులు కూడా పంథాను మార్చారు. గతంలో చీటీలు రాసి ఇచ్చి...సాయంత్రానికి లాటరీ తగిలిన నంబర్లు మొత్తం ఇస్తుండేవారు. ఇప్పుడు సాంకేతికను చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ లింకుల ద్వారా కొంత మంది ఇదే వృత్తితో కూలీలు, కార్మికులు, ఆటోవాలాల బతుకలతో ఆటలాడుతున్నారు.

కొత్త పుంతలు తొక్కుతున్న లాటరీలు

లాటరీలు కూడా కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో ఒక టికెట్టు కొంటే.. అందులో సదరు కంపెనీ ఇచ్చిన నంబర్ ఉంటే.. ఇంత మొత్తంలో నగదు వచ్చేది.ఈ క్రమంలో ఆశావహులు వేలాది రూపాయలు నష్టపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని, అందులో పలు ప్రాంతాల నుంచి వచ్చే లింకులు ఆధారంగా ఆటలు ఆడిస్తున్నారు. చక్కా.. మక్కా, బోడోలాండ్, సూపర్ చక్కర్, మట్కా కింగ్, సూపర్ రైడర్, ది ఫాక్స్, క్యాసినో కింగ్, గ్యాంబ్లిగ్ బాబాతో పాటు అనేక రకాల యాప్‌ల ద్వారా లాటరీ నిర్వహణ కొనసాగుతోంది. రిక్షా, తోపుడు బండ్లు, కూలీలు చేసుకునే కార్మికులు, ఆటోవాలాలు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు సైతం సులభ సంపాదన కోసం ఆశపడి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. రూ. 10 కడితే రూ. 800 ఇస్తారని చెప్పి వేల రూపాయల వరకు కట్టిస్తున్నారు. ఒక్క గుంటూరు నగరం పరిధిలోనే నిత్యం రూ. 20లక్షలకు పైగా ఆన్‌లైన్‌లో ఆటలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఎక్కడో ఉండి... ఇక్కడ దందా !

సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకులు మాత్రం ఎక్కడో నివసిస్తూ.. సొంత వ్యక్తులు, మేనేజర్లను పెట్టుకుని మరీ దందా సాగిస్తున్నారు. భారీ ఆటలు జరిగే ప్రాంతాలకు మాత్రం పోలీసులు వెళ్లరు. ఒక వేళ వెళ్లినా .. స్టేషన్ మఫ్టీల నుంచి ముందుగానే సమాచారం అందుతోందనే ఆరోపణలు లేకపోలేదు. ఒక వ్యాపారి కింద సుమారుగా 10 నుంచి 20 మంది వరకు మేనేజర్లు ఉంటారు. వారికి రూ. 15వేల నుంచి రూ.25వేల వరకు సీనియారిటీని బట్టి జీతాలు ఫిక్స్ చేస్తున్నారు. దీనితో పాటు మేనేజర్, నంబర్లు రాసుకునే వ్యక్తికి నిత్యం రెండుసార్లు జరిగే ప్రతి ఆటలోనూ కమిషన్ వస్తుందని సమాచారం.

గుంటూరు నగరం అడ్డా

సింగిల్ దందాకు గుంటూరు అడ్డాగా మార్చేశారు. నగరంలోని కొరిటిపాడు, శారదాకాలనీ, అరండల్‌పేట, పిచ్చుకులగుంట, అరండల్‌పేట 1వ లైను రైల్వేస్టేషన్ వద్ద, గుజ్జగుండ్ల, వెంకటప్పయ్య కాలనీ, శ్రీనివాసరావుపేట, ఆర్టీసీ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, నందివెలుగు రోడ్డు, సుద్దపల్లి డొంక, పొన్నూరు రోడ్డు, కొత్తపేట, మణిపురం బ్రిడ్జి, నాజ్ సెంటర్, నెహ్రూనగర్, పట్నంబజారు, సంగడిగుంట, ఏలూరు బజారు, నల్లచెరువు అధికంగా సింగిల్ నంబర్ లాటరీ జరుగుతోందని తెలుస్తోంది.

నెలవారీ మామూళ్ల వసూలు

సింగిల్ దందాలో అత్యంత కీ రోల్ పోషిస్తోంది మాత్రం ఆయా స్టేషన్ పరిధిలోని పలువురు అధికారులు, మఫ్టీ పార్టీ కానిస్టేబుళ్లననే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌కు అతి సమీపంలో ఉండే ఒక స్టేషన్ మఫ్టీ పార్టీగా వ్యవహరించే ఒక కానిస్టేబుల్ సింగిల్ నంబర్ నిర్వాహకుల్ని స్టేషన్‌కు పిలిపించి మరీ బెదిరించినట్లు తెలుస్తోంది. ఇదే స్టేషన్‌లో ఒక ఎస్‌ఐ నెలవారీలు తీసుకుని మరీ ఆటలు ఆడించేందుకు అనుమతులు ఇచ్చారని చెప్పుకుంటున్నారు. వస్త్ర దుకాణాలు అధికంగా ఉండే ఒక స్టేషన్ పరిధిలో కొద్ది కాలం కిందట సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుడు దొరికితే.. ఆ కేసు పక్కదోవ పట్టించి, రోడ్డుపై పేకాట ఆడుతున్నాడనే కేసులో నిందితుడిగా చూపించి లక్షలాది రూపాయాలు తీసుకున్నారని సమాచారం. అతని వద్ద పుస్తకాలు, మరిన్ని ఫోన్ నంబర్లు దొరకగా ఒక ఎస్‌ఐ కీరోల్ వ్యవహరించి ఆ కేసును మార్చివేశారు. వెస్ట్ పరిధిలోని వాణిజ్య వ్యాపారాలు అధికంగా ఉండే స్టేషన్ పరిధిలో సదరు స్టేషన్ అధికారికి మఫ్టీ పార్టీ, ఇద్దరు కానిస్టేబుళ్లు నెలవారీ వసూళ్లు చేస్తున్నారని సమాచారం.

సమాచారం ఇవ్వండి



సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుల సమాచారం తెలిస్తే నా సెల్ నంబర్ 8688831302కు అందజేయచ్చు. ఆయా స్టేషన్ అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడినా.. అక్రమాలు చేసినా.. కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, సింగిల్ నంబర్ లాటరీలు నియంత్రిస్తాం.

– కె. సుప్రజ, అడ్మిన్, అడిషనల్ ఎస్పీ, గుంటూరు

పంట మార్పిడితో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంసీపీ రజని తదితరులు

లింగంగుంటపాలెం(కాకుమాను): పంట మార్పిడితో రైతులంతా అధిక దిగుబడులు సాధించాలని ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ రజిని తెలిపారు.మండలంలోని లింగంగుంటపాలెంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ రైతులు ఏటా ఒకే రకమైన పంటల్ని సాగు చేయకుండా మార్పిడి విధానాన్ని అవలంబించి సాగులో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.వేసవిలో పంట పొలాల్లో నవ ధాన్యాల సాగు (పీఎండీఎస్) ద్వారా భూమిలో సారవంతం పెరగడంతో పాటు రైతులకు లాభాలు వస్తాయని ఆమె తెలిపారు. పంట పూర్తయిన తరువాత భూమిలో కలియదున్నడం వల్ల జీవ వైవిధ్యం పెరిగి రానున్న ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రతి రైతూ వేసవిలో పంట పొలాల్ని ఖాళీగా ఉంచకుండా నవ ధాన్యాల సాగును చేయాలని ఆమె సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా బాజీ బాబా ఉరుసు మహోత్సవం

భక్తులకు గంధం పంపిణీ



గంధం పంపిణీ చేస్తున్న వక్ఫ్ బోర్డు అధికారులు

పెదకాకాని: బాజీ బాబా దర్గా 535వ ఉరుసు మహోత్సవం శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలతో ముగిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. పకీర్ల సన్నాయి వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు, కనక తప్పెట్లు, బాణా సంచా వెలుగుల్లో ఉరుసు ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దర్గా ప్రాంగణమంతటా విద్యుత్ కాంతులతో కళకళలాడింది. వీధుల్లో గ్రామోత్సవాన్ని స్వాగతించి భక్తులు భక్తిశ్రద్ధల్ని చాటుకున్నారు.ఏర్పాట్లను వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదం షఫీ, ఈఓ షేక్ ముక్తార్ బాషా పర్యవేక్షించారు. సంప్రదాయ పద్ధతిలో దర్గా ఉరుసు మహోత్సవం గురువారం రాత్రి పెదకాకాని పొలిమేర సెంటర్ నుంచి ప్రత్యేక చాందిని అలంకరణలో గంధం బిందెలతో ప్రారంభమైంది. బాజీ బాబా వారి గుర్రం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల వరకూ వెనిగండ్ల పెదకాకాని పురవీధుల్లో పర్యటించింది. అధిక సంఖ్యలో భక్తులు మిఠాయిలు, పండ్లు తినిపించారు. కొబ్బరికాయలు, పూలు, గంధం సమర్పించారు. గుర్రం దర్గాలోకి చేరుకోగానే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు గంధం పంపిణీ చేశారు. భక్తులు ఒక్కసారిగా ఎగబడటంతో పరిస్థితిని పోలీసులు అదుపులోకి తెచ్చారు. గురువారం రాత్రికి అధిక సంఖ్యలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు రాత్రి వేళల్లో దర్గాలో నిద్రలు చేశారు. ఉరుసు ఉత్సవం విజయవంతం కావడానికి సహకరించిన పోలీసు, పంచాయతీ, ఆరోగ్యశాఖ సిబ్బందికి వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా కృతజ్ఞతలు తెలిపారు.

గుబాళించిన కళా ‘పరిమళం’

ముగిసిన నాటికల పోటీలు



ఉత్తమ ప్రదర్శగా నిలిచిన కొత్తపరిమళం నాటికలోని దృశ్యం

పెదనందిపాడు: లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో వరగాని గ్రామంలో నిర్వహించిన సప్తమ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు గురువారం అర్ధరాత్రితో ముగిశాయి. శుక్రవారం నాటికల పోటీల ఫలితాలను కళాపరిషత్ అధ్యక్షుడు పోపూరి నాగేశ్వరరావు వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనగా బోరువంక శార్వాణీ యువజన సంఘం ప్రదర్శించిన కొత్తపరిమళం, ద్వితీయ ప్రదర్శనగా కొలకలూరు సాయి ఆర్ట్స్ ప్రదర్శించిన గమ్యస్థానాలవైపు, తృతీయ ప్రదర్శనగా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ ప్రదర్శించిన వెండిఅంచులు నిలిచాయి. జ్యూరీ ప్రదర్శనగా గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన నానా నేనొచ్చేస్తా నిలిచింది. ఉత్తమ నటుడిగా అస్థికలు నాటికలో బసవయ్య పాత్రధారి నాయుడుగోపి, ఉత్తమ నటిగా నాన్ననేనొచ్చేస్తా నాటికలో సావిత్రి పాత్రధారిణి ఎస్. అమృతవర్షిణి, క్యారెక్టర్ నటిగా అస్థికలు నాటికలో జయమ్మ ప్రాతధారి లహరి, ఉత్తమ ప్రతినాయకుడిగా కొత్తపరిమళం నాటికలో ఉస్మాన్‌ఖాన్ పాత్రధారి బి. చలం, ఉత్తమ హాస్యనటుడిగా స్వర్ణకమలాలు నాటికలో పార్థసారథి పాత్రధారుడు ఇ.రమేష్ పురస్కారాలు గెలుచుకున్నారు. ఉత్తమ రచయితగా అస్థికలు రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు, ఉత్తమ దర్శకుడిగా గమ్యస్థానాలవైపు దర్శకుడు గోపరాజు విజయ్, ఉత్తమ సంగీతంగా వెండిఅంచులు కె.సత్యన్నారాయణమూర్తి, ఉత్తమ అహార్యం కొత్తపరిమళం రమణారావు, ఉత్తమ రంగాలంకరణ మృత్యుపత్రం లావు అనిల్, ఉత్తమ లైటింగ్ గమ్యస్థానాలవైపు కె.నూకరాజు, ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. వీరికి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు ముద్దన రాఘవయ్య, ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు, సర్పంచి బొడ్డు మేరిమ్మ, సభ్యులు బందారు రాంబాబు, పోపూరి శివరామప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి

ప్రైవేటు ఆసుపత్రి ముందు బంధువుల ఆందోళన

గుంటూరు ఈస్ట్: వైద్యుల నిర్లక్ష్యం వల్లే గర్భంలోనే శిశువు మృతి చెందిందని తండ్రి, బంధువులు నగరంపాలెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ముందు శుక్రవారం ఆందోళన చేశారు. యడ్లపాడు మండలం కొండవీడు గ్రామానికి చెందిన గంటా వెంకటేశ్వరరావు భార్య శిల్ప రెండో గర్భం దాల్చింది. డెలివరీ సమయం దగ్గరపడడంతో ఆసుపత్రికి వెళ్లింది. వైద్యులు చేర్చుకుని పరీక్షలు నిర్వహించారు. డెలివరీకి పది రోజుల సమయం ఉందంటూ అత్యవసర వార్డు నుంచి సాధారణ వార్డుకు మార్చారు. అయితే, శిల్ప విపరీతమైన కడుపునొప్పితో బాధ పడుతూ, వైద్యులకు తెలిపినా కొన్ని గంటలపాటు పట్టించుకోలేదు. అనంతరం థియేటర్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయగా, మృత శిశువు జన్మించింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు చనిపోయిందంటూ వెంకటేశ్వరరావు, బంధువులు ఆరోపించారు. మృత శిశువు ఉన్న బాక్సుతో ఆసుపత్రి ముందు కూర్చొని న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. శిల్ప ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో ఐసీయూలో ఉంచి వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఆసుపత్రి సిబ్బంది వెంకటేశ్వరరావుతో చర్చలు జరుపుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో స్పిన్నింగ్ మిల్లు కార్మికుడి మృతి

చేబ్రోలు: స్థానిక ఓ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న కార్మికుడు అనుమానాస్పదస్థితిలో మరణించిన సంఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఒరిస్సా రాష్ట్రం నరేంద్రపురం ప్రాంతానికి చెందిన కైలాష్ చంద్ర బెహరా (37) భార్య, ఇద్దరు పిల్లలతో కలసి చేబ్రోలు ప్రాంతంలోని జయలక్ష్మి స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్‌లో ఉంటూ కార్మికునిగా పని చేస్తున్నాడు. కొద్ది రోజుల కిందట కుటుంబంతో కలసి స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ భార్య, పిల్లల్ని వదిలి పది రోజుల కిందట వచ్చి క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. 19వ తేదీ వరకు భార్య, కుటుంబసభ్యులతో చంద్ర బెహరా మాట్లాడాడు. అయితే, 20వ తేదీ నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో అనుమానంతో సహచర మిల్లులోని కార్మికులకు భార్య సమాచారం ఇచ్చింది. వారు గమనించి క్వార్టర్స్‌లో మృతి చెందినట్లు తెలిపారు. ఆమె ఇక్కడకు వచ్చి పరిశీలించగా నోటి వెంట నురుగు ఉంది. మృతిపై అనుమానాలున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కె. ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

రైతులకు రుచికరమైన భోజనం అందించాలి



రైతులతో కలసి భోజనం చేస్తున్న సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి రైతులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి కాంట్రాక్టరును ఆదేశించారు. మార్కెట్ యార్డులో శుక్రవారం కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డితో కలసి ఉచిత భోజనశాలను ఆయన సందర్శించారు. రైతులతో కలసి స్వయంగా వారు భోజనం చేశారు. అనంతరం యార్డులో పర్యటించారు. రైతులతో మాట్లాడి సేవలు, మిర్చి ధరల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కమీషన్ షాపుల ముందు మిర్చి బస్తాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సూచించారు. ఎగుమతి వ్యాపారులు ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చి బస్తాలను అదే రోజు బయటకు తరలించాలని చెప్పారు. ప్రతి దిగుమతి షాపు వద్ద డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు మంచి ధర లభించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఆయన వెంట యార్డు ఇన్‌చార్జి కె.శివారెడ్డి తదితరులున్నారు.

వృద్ధులు, వితంతువులకు చీరల పంపిణీ

గుంటూరు మెడికల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్ఫీనా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం తాడికొండ మండలం లాం గ్రామంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యుల సహకారంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేదలకు, ఇతర జిల్లాల్లోని వారికి బియ్యం, వస్త్రాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాల్ని ఐదేళ్లుగా నిర్విరామంగా చేస్తున్నామని నిర్వాహకులు జాలాది సెల్వరాజ్ తెలిపారు. కోవిడ్‌లో సైతం శానిటేషన్ సిబ్బందికి ఆహారం, రక్షణకు మాస్కులు, శానిటైజర్లు, వస్త్రాలు అందించామని పేర్కొన్నారు. ఇటీవల విశాఖపట్నం పారా అథ్లెటిక్ గంగకు జిమ్ పరికరాలు అందిచామని చెప్పారు. కార్యక్రమంలో మేరి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



చినలింగాయపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

చినలింగాయపాలెం(కాకుమాను): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే జగనన్న పాలనలోనే సాధ్యమవుతుందని కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. మండలంలోని చినలింగాయపాలెంలో శుక్రవారం రాత్రి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన సాగిస్తున్న దేశ చరిత్రలో ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు.కులాలు, మతాలు, ప్రాంతాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కన్వీనర్ యాజలి సూరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు జూపూడి ఏసేబు, పార్టీ నాయకులు, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ప్రతిభా పురస్కార్ స్కాలర్‌షిప్స్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త శ్రీకూర్మనాథ్, సిబ్బంది

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాల, గుంటూరు పట్టణంలోని పెద్ద పలకలూరులోని విజ్ఞాన్ మహిళా జూనియర్ కళాశాలల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ‘‘విజ్ఞాన్ ప్రతిభా పురస్కార్’’ పేరుతో నిర్వహించే ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన వారికి ఇంటర్మీడియట్‌లో స్కాలర్‌షిప్స్ అందజేస్తామని విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా 75 శాతం నుంచి 25 శాతం వరకు ఫీజులో రాయితీను అందజేస్తామని వెల్లడించారు. వచ్చే సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశ పరీక్షలను వడ్లమూడి జూనియర్ కాలేజీ, గుంటూరు పట్టణంలోని పెద్ద పలకలూరు విజ్ఞాన్ మహిళా జూనియర్ కళాశాలలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జె.మోహనరావు, వై.వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కర్నుమా, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

పట్నంబజారు: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ కర్నుమా, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చెప్పారు. నగరపాలెంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కర్నుమా మాట్లాడుతూ రంజాన్‌ను సందర్భంగా నగరంలోని నగరంపాలెం ఈద్గా, పాత బస్టాండ్‌లోని మొహమ్మదీయన్ పాఠశాల, ఆంధ్రా ముస్లిం కళాశాల ఆవరణలో ముస్లింలు ప్రార్థనలు చేస్తారని తెలిపారు. ఈ మూడు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. వారి సంక్షేమం కోసం పల పథకాల్ని తీసుకువచ్చారని తెలిపారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఈద్గాల వద్ద ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు నూరి ఫాతిమా, కార్పొరేటర్లు మెహమూద్, ఖాజామొహీద్దీన్ చిష్టి, ఆబిద్‌బాషా, మీరావలి, అంజుమన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముస్తఫా రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పండుగను పురస్కరించుకుని నెల రోజులు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ, కఠిన నియమాలతో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



చిన్నారులతో కృష్ణప్రసాద్, రథినీ చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం యూకేజీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకత, నైపుణ్యాల్ని వెలికితీయడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. పిల్లల్ని ప్రతిభా పాటవ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థిని షాలిని ఉపాధ్యాయులు అడిగిన ప్రశ్నలకు చకచకా సమాధానాలు చెప్పి అందరినీ ఆకర్షించింది. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రధినీ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.